RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:34 24-7-2025 గురువారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-





## ఆపరేషన్ సిందూర్.. డేట్స్ ఫిక్స్..

న్యూఢిల్లీ,జులై 23,(టుడే విదుర): పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' )పై ఈనెల 29న పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరగనుంది. 16 గంటల సేపు చర్చ జరిపేందుకు పార్లమెంట్ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.కీలకమైన 'ఆపరేషన్ సిందూర్' అంశంపై ప్రధానమంత్రి ఉభయసభలు, దేశాన్ని ఉద్దేశించి మాట్లాడాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది. తన జోక్యంతోనే ఇండియా–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ప్రకటించుకోవడంతో విపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. అసలు ఎలాంటి ఒప్పందం జరిగిందని ప్రశ్నిస్తున్నాయి.

# సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటేనే అభివృద్ధి: సీఎం చంద్రబాబు

విజయవాడ,జులై 23,(టుడే విదుర): సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటేనే అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఆర్థిక సంస్కరణలు, 1995లో టెక్నాలజీ రివల్యూషన్‌తో పరిస్థితి మారిందని తెలిపారు. ఏడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్ అని కొనియాడారు. సరికొత్త ఆలోచనలతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమని నొక్కిచెప్పారు. వికసిత్ భారత్‌తో 2047 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని వ్యాఖ్యానించారు. ఏపీలో 2026 జనవరి నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యూఏఈ అభివృద్ధిలో భారత్ భాగస్వామ్యం హర్షణీయమని అన్నారు. దుబాయ్‌ను చూస్తుంటే తనకు అసూయ వేస్తోందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.దుబాయ్‌లో ఎడారి ప్రాంతాలు, బీచ్‌లు పర్యాటకులకు ఆహ్లాదకర అనుభూతిని కలిగిస్తాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1991లో ఆర్థిక సంస్కరణలు,.. 1995లో టెక్నాలజీ రివల్యూషన్‌తో పరిస్థితి మారిందని పేర్కొన్నారు. ఏపీలో పెట్టుబడులు ప్రోత్సహించడమే లక్ష్యంగా పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ(బుధవారం జులై 23) విజయవాడలో సమ్మిట్ నిర్వహించారు. యూఏఈ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది. భారత్



– యూఏఈ ఆర్థిక సంబంధాల బలోపేతంపై చర్చించారు. పెట్టుబడులకు ముఖద్వారంగా ఏపీ అనే అంశంపై సీఎం మాట్లాడారు. ఈ సమావేశంలో ఇన్వెస్టోపియా సీఈఓ డాక్టర్ జీన్ ఫేర్స్, సీఐఐ వైస్ ప్రెసిడెంట్, భారత్ బయోటెక్ ఎండీ డాక్టర్ సుచిత్ర కె.ఎల్ల, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

## ఏఐతో ఉద్యోగాలు..

### మంత్రి లోకేష్ కీలక వ్యాఖ్యలు

అమరావతి,జులై 23,(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మన మిత్ర ద్వారా మెరుగైన సేవలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. గతంలో ఎయిర్‌పోర్ట్ ఎలా ఒక ప్రాంతం రూపురేఖలు మార్చిందో చూశామని తెలిపారు. తెలంగాణ జీడీపీలో ఎయిర్‌పోర్ట్ వల్ల ఆదాయం 17శాతం నుంచి 18శాతానికి పెరిగిందని వివరించారు. ఏపీలో పెట్టుబడులు ప్రోత్సహించడమే లక్ష్యంగా పారిశ్రామిక వేత్తలతో (బుధవారం, జులై 23) విజయవాడలో సమ్మిట్ నిర్వహించారు. యూఏఈ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది. భారత్–యూఏఈ ఆర్థిక సంబంధాల బలోపేతంపై మంత్రి నారా లోకేష్ ఈ సదస్సులో ప్రసంగించారు.

## ఆత్మకూర్ అటవీ శాఖలో రూ.4.37 కోట్ల కుంభకోణం

నంద్యాలజులై 23,(టుడే విదుర): నంద్యాల జిల్లా ఆత్మకూర్ అటవీ శాఖలో కోట్ల రూపాయల మోసం వెలుగులోకి వచ్చింది. అటవీ శాఖ డీఎఫ్ఓ సాయిబాబా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పర్యవేక్షణలో పోలీసులు ఈ కేసును విచారించి మంగళవారం వివరాలను మీడియాకు వెల్లడించారు.

డీఎస్పీ రామాంజి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం, నల్లమల్ల అటవీ పరిధిలో రహదారుల వద్ద ఉన్న చెక్‌పోస్టుల ద్వారా వసూలు ఆదాయాన్ని రిటైర్డ్ ఏవో చాంద్ బాషా పక్కదారి పట్టించాడని తెలిపారు. అతను తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి డబ్బులు బదిలీ చేసినట్టు పోలీసులు గుర్తించారు.

# ఐపీఎస్ అధికారి సంజయ్ బెయిల్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు




న్యూఢిల్లీ, జులై 23,(టుడే విదుర): ఏపీ సీఐడీ మాజీ చీఫ్ ఎన్ సంజయ్ ముందస్తు బెయిల్ రద్దుపై సుప్రీంకోర్టులో జస్టిస్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఏపీ హైకోర్టు 49 పేజీలతో ముందస్తు బెయిల్ ఇస్తూ తీర్పు ఇవ్వడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఏపీ హైకోర్టు సంజయ్ ముందస్తు బెయిల్ ఇచ్చే సమయంలోనే మొత్తం విచారణ జరిపినట్లుగా ఉందంటూ కీలక వ్యాఖ్యలు చేసింది.ఈ కేసుకు సంబంధించి ఒప్పంద పత్రం, ఇన్‌వాయిస్‌లను సమర్పించాలని ఆదేశించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణ జులై 30వ తేదీకి వాయిదా వేసింది. అయితే అవినీతి జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా.. వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా ఎన్ సంజయ్‌కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిందంటూ ఏపీ ప్రభుత్వ తరఫున ఏఎస్‌జీ ఎస్వీ రాజు.. జస్టిస్ అమానుల్లా దృష్టికి తీసుకువెళ్లారు.అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా ఎన్ సంజయ్ పని చేశారు. ఆ సమయంలో ఆయన అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ప్రభుత్వం కేసు నమోదు చేసింది. దీంతో ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆయన ఆశ్రయించారు. ఆ క్రమంలో ఆయనకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీనిని సవాల్ చేస్తూ.. సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు పై విధంగా స్పందించింది

# పోలీసులు గంజాయి అమ్మకాలకు కొమ్ము కాస్తున్నారు.. కొలికపూడి ఫైర్




ఎన్టీఆర్ జిల్లా,జులై 23,(టుడే విదుర): తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ ఒక బ్యాచ్‌నీ పెట్టుకొని గంజాయి అమ్మే, కొనే వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆరోపణలు చేశారు. తిరువూరు స్టేషన్‌లో ఎస్ఐ ప్రైవేట్ పంచాయతీలు చేస్తూ అక్రమ వసూళ్లకి పాల్పడుతున్నాడని పూర్తి ఆధారాలు తాను చూపిస్తానని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. ఎస్ఐ సత్యనారాయణ ఒక వ్యక్తినీ గంజాయి అమ్ముతున్నాడని స్టేషన్‌కి పిలిపించారని.. మరో వ్యక్తి ద్వారా డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఎస్ఐకి బాధిత వ్యక్తి కుటుంబ సభ్యులు బంగారం తాకట్టు పెట్టి లక్షన్నర డబ్బులు ఎస్ఐ సత్యనారాయణకి ఇచ్చారని తెలిపారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.

అసలు ఏమైందంటే..

కాగా, ఇద్దరు టీడీపీ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. అయితే ఈ గొడవలో చిల్లపల్లి రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్తపై దాడికి అదే పార్టీకి చెందిన కందిమల్ల సాయి సుమిత్ , పానుగంటి వెంకట్, మరో నలుగురు వ్యక్తులు దాడికి యత్నించారు. తనపై దాడి నుంచి తప్పించుకునే యత్నంలో సాయి సుమిత్‌పై సీసాతో టీడీపీ కార్యకర్త చల్లపల్లి రామకృష్ణ గాయపరిచాడు. సాయి సుమిత్ ఫిర్యాదు మేరకు రామకృష్ణపై 307 కేసు నమోదు చేశారు తిరువూరు పోలీసులు. రామకృష్ణ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆయన తల్లి రాఘవమ్మ, సోదరి వరలక్ష్మిలను స్టేషన్‌కు తీసుకువచ్చారు పోలీసులు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కూడా రామకృష్ణ తల్లి, సోదరుడిని స్టేషన్‌లోనే ఉంచారు. ఈ విషయంలో పోలీస్‌లపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏడారిలో స్వర్గం – దుబాయ్ ను చూస్తే అసూయ – చంద్రబాబు

విజయవాడ జులై 23,(టుడే విదుర): ఆలోచనలు ప్రత్యేకంగా ఉన్నప్పుడే మనం ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 1.1 కోట్ల మంది యూఏఈ జనాభాలో 40 శాతం మంది ఇండియన్స్ ఉన్నారు.. వారి ద్వారా కూడా యూఏఈలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. విజయవాడలో నేడు ప్రారంభమైన ఇన్వెస్టోపియా గ్లోబల్ సమ్మిట్ లో ఆయన మాట్లాడుతూ, తాను జనవరిలో అబ్దులా బిన్ ను కలిసాను అప్పుడు ముందుగా ఏపీకి రావాలని కోరానన్నారు.. ఏపీ గురించి మీకు అప్పుడే అర్థమవుతుందని చెప్పా.. ఇచ్చిన మాట ప్రకారం ఆయన తొలుత ఆంధ్రప్రదేశ్ కే వచ్చారని గుర్తు చేశారు. యూఏఈని ఓ దేశంగా చూస్తే ప్రతి దేశానికి కొన్ని అడ్వంటేజ్స్ ఉంటాయని అంటూ దుబాయ్ ప్రాంతంలో 50 డిగ్రీల టెంపరేచర్ ఉన్నా.. ఎడారి ఉన్నా ఆ ప్రాంతాన్ని వారు స్వర్గంలా మార్చారని వివరించారు.. అక్కడి అభివృద్ధిని చూశానన్నారు. ఇక, వారు ఇంటర్నెట్ సిటీ పెడితే, నేను హైటెక్ సిటీ కట్టానని పేర్కొన్నారు.. 2021లో మనం కరోనా వల్ల భయపడ్డాం ఆ సమయంలో యూఏఈ ఇస్టోపియాను తీసుకువచ్చారు అని చంద్రబాబు చెప్పారు.




**ఇసుకదేశంలో ఆర్థిక సంపద, అభివృద్ధికి బాసట**
**భారత యువశక్తికి అక్కడు మెరుగైన అవకాశాలు**
**ఆ అభివృద్ధి అమరావతికి కావాలి..**
**ఎపిలో పెట్టుబడులు పెట్టండి..సింగిల్ క్లిక్ తో అనుమతులిస్తాం**
**ఇన్వెస్టోపియా గ్లోబల్ సమ్మిట్ లో చంద్రబాబు**


విదేశాలలో మన మానవ శక్తికి ఎక్కువ అవకాశాలు ఆ దేశంలోనూ మనకు ఎక్కువ అవకాశాలు వస్తున్నాయన్నారు.. ఇండియాను ఎవ్వరు వ్యాపారపరంగా విస్మరించలేరన్నారు. .. డెమొగ్రఫిక్ డివిడెంట్ కేవలం ఇండియాకు మాత్రమే ఉందని పేర్కొన్నారు చంద్రబాబు .. చాలా దేశాలు ఏజింగ్ ప్రాబ్లంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు..అయితే భారత్ కు ఆ బెడద లేదన్నారు ఇండియాలో రైట్ టైం రైట్ ప్లేస్ లో ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారని చెప్పారు.. 2024–25లో 100 బిలియన్ యూఎస్ డాలర్ల వ్యాపారం యూఏఈకి ఇండియాకు మధ్య జరిగింది అన్నారు. గత పదేళ్లగా 11 స్థానం నుంచి 4వ స్థానానికి భారత్ చేరుకుందని సీఎం చంద్రబాబు తెలిపారు.

## శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి

శ్రీశైలం,జులై 23,(టుడే విదుర) : ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న వరద నీటి కారణంగా శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి పెరుగుతోంది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి వరద వచ్చి డ్యామ్‌లో చేరుతున్నది. ప్రస్తుతం జలాశయానికి 91,812 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఇక అవుట్ ఫ్లో 1,14,709 క్యూసెక్కులుగా నమోదైంది. ఒక స్పిల్ వే గేట్ ఎత్తి 27,52 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

# రైల్లో ఏకంగా 56మంది యువతులు

## అనుమానంతో ఆరా తీస్తే ..!



పశ్చిమ బెంగాల్ ,జులై 23,(టుడే విదుర): ఏకంగా 56 మంది యువతులు రైల్లో ప్రయాణిస్తున్నారు వారివద్ద టికెట్లు గానీ, ఇతర పత్రాలు గానీ ఏమీ లేవు. వారందరి ముఖాల్లో ఆందోళన..! ఇదంతా గమనించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది గట్టిగా ఆరా తీసి అరెస్టు చేశారు. మహిళా అక్రమ రవాణాగా గుర్తించిన అధికారులు ఎట్టకేలకు ఆ యువతులందరినీ వారివారి తల్లిదండ్రులకు అప్పగించారు.. !అసలేం జరిగిందంటే. సోమవారం రాత్రి పశ్చిమ బెంగాల్ నుంచి బీహార్ కు బయలుదేరిన న్యూ జల్పారుగురి–పట్నా క్యాపిటల్ ఎక్స్‌ప్రెస్‌లో 56 మంది యువతులు ఎక్కారు. వీరితో పాటు ఓ మహిళ, పురుషుడు ఉన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరున్న బోగీ వద్దకు వచ్చారు. యువతులంతా ఇలా ఒకేసారి ప్రయాణించడం, వారి ముఖాల్లో ఆందోళన గమనించిన రైల్వే సిబ్బందికి అనుమానం కలిగింది. వెంటనే వారిని టికెట్లు చూపించాలని అడిగారు. కానీ, వారివద్ద టికెట్లు గానీ, ఇతర పత్రాలు గానీ ఏమీ లేవు. కేవలం కోచ్, బెర్త్ నంబర్లు మాత్రమే వారి చేతులపై ముద్రించారు. దీంతో సిబ్బంది వారిని ప్రశ్నించారు. బెంగళూరుకు చెందిన కంపెనీలో ఉద్యోగం కోసం తమను రైల్లో తీసుకెళుతున్నారని అందులోని ఓ యువతి చెప్పింది. బెంగళూరులో ఉద్యోగమైతే బీహార్‌కు ఎందుకు తీసుకెళుతున్నారని వారితో ఉన్న వ్యక్తులను సిబ్బంది ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో రైల్వే సిబ్బంది వారిని అరెస్టు చేశారు. మహిళల అక్రమ రవాణాలో భాగంగానే వీరిని బీహార్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయ్యింది. ఆ యువతులందరినీ రక్షించిన అధికారులు వారి కుటుంబాలకు అప్పగించారు. యువతులందరూ 18–31 ఏళ్ల లోపు వారే కావడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.

# సంపాదకీయం

## ధన్‌ఖడ్ రాజీనామా మిగిల్చిన ప్రశ్నలు

ఆయనకు రాజ్యాంగం గురించి అద్భుతమైన పరిజ్ఞానం ఉన్నది. చట్టసభల వ్యవహారాలు ఆయనకు కొట్టిన పిండి..' ఇవి, ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌ఖడ్‌ను ఎంపిక చేసుకున్నప్పుడు ఆయనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కురిపించిన ప్రశంసలు. సాగుచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పుడు వారిలో అత్యధికంగా ఉన్న జాట్ రైతులను తమ వైపుకు తిప్పుకునే ప్రయత్నంలో భాగంగా ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతిగా బీజేపీ ఎంపిక చేసింది. ఆయనను కిసాన్ పుత్రుడని, పరిపాలనా వ్యవహారాల్లో సమర్థుడని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా నాడు కొనియాడారు. అలాంటి ధన్‌ఖడ్ తాను ఆరోగ్యకారణాల రీత్యా రాజీనామా చేస్తున్నానంటే బీజేపీ ఎందుకు వదులుకున్నది? అసలు నిజంగా ఆరోగ్య కారణాల వల్లే ఆయన తప్పుకున్నారా? సోమవారం ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ప్రతిపక్షాలకు ఎన్నో అస్త్రాలను అందించాయి. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌లో భారతదేశం అయిదు యుద్ధ విమానాలను కోల్పోయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వారం రోజుల క్రితం ప్రకటనలు చేయడం, రక్షణదళాల ప్రధానాధిపతి ఈ ప్రకటనను ఖండించకపోవడం ప్రతిపక్షాలకు ఉత్సాహాన్నందించింది. ఆపరేషన్ సిందూర్‌తో పాటు బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఆత్మరక్షణలో పడేయాలని ప్రతిపక్షాలు సమాయత్తమవుతున్న నేపథ్యంలో జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా పరిస్థితిని మరింత అయోమయంగా మార్చిందనడంలో సందేహం లేదు. దేశంలో రెండవ అత్యంత ఉన్నతమైన రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి రాజీనామా చేయడం సహజంగానే సంచలనం సృష్టించింది. 2019లో ధన్‌ఖడ్‌ను పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా నియమించినప్పుడు ఆయన గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. 1987లో రైతు నేత దేవీలాల్ ఢిల్లీలో రైతుల ధర్నా నిర్వహించినప్పుడు ధన్‌ఖడ్ తన ఝున్‌ఝున్ ప్రాంతం నుంచి దాదాపు 500 వాహనాల్లో రైతులను సమీకరించి తీసుకువచ్చి ఆయనకు సన్నిహితుడయ్యారు. దీనితో 1989లో ఝున్‌ఝున్ నియోజకవర్గం నుంచి ధన్‌ఖడ్‌కు జనతాదళ్ తరఫున ఎంపీ సీటు ఇచ్చి స్వయంగా ప్రచారం చేసి గెలిపించడమే కాక విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ప్రభుత్వంలో సహాయమంత్రి పదవి కూడా ఇప్పించారు. దేవీలాల్‌ను వీపీ సింగ్ ఉపప్రధాని పదవి నుంచి తొలగించినప్పుడు ధన్‌ఖడ్ కూడా రాజీనామా చేసి ఆయనకు అండగా నిలిచారు. వీపీ సింగ్ తర్వాత ప్రధాని అయిన చంద్రశేఖర్ మంత్రివర్గంలో కూడా ధన్‌ఖడ్ కొనసాగారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రి అయినప్పుడు జనతాదళ్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతల్లో లాల్‌బహదూర్ శాస్త్రి కుమారుడు అనిల్ శాస్త్రి, ధన్‌ఖడ్ కూడా ఉన్నారు. ఎంపీగా ఓడిపోవడంతో కాంగ్రెస్ ఆయనకు 1993లో రాజస్థాన్‌లో కిషన్‌ఘర్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. బాబ్రీ మసీదు కూల్చి వేత తర్వాత ఆర్ఎస్ఎస్‌ను ధన్‌ఖడ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్ఎస్ఎస్ లాంటి తీవ్రవాద సంస్థకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్థానం లేదని ఆయన శాసన సభలో తీవ్రంగా విమర్శించారు. ఇదంతా గతం. 1998లో మళ్లీ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత ఆయన రాజకీయాలను వదిలి న్యాయవాద వృత్తిలో నిమగ్నమయ్యారు. దాదాపు అయిదేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉండి ఏ బీజేపీనైతే తాను తీవ్రంగా విమర్శించారో అదే పార్టీలో ఆయన చేరారు. దరిమిలా చాలా కాలం బీజేపీ లీగల్ సెల్‌లో పనిచేసిన తర్వాత ఆయనకు 2016లో ఆ సెల్ సారథ్యం లభించింది. రామజన్మభూమి కేసుల్లోనూ, ఉగ్రవాద కేసుల్లోను బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలకు న్యాయ సహాయం అందించేవారు. ధన్‌ఖడ్‌పై మోదీ దృష్టి ఎలా పడిందో కాని 2019లో ఆయనను ఏకంగా పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా నియమించారు. మూడు సంవత్సరాల పాటు అనేక బిల్లులను తొక్కిపెట్టడం, తీవ్ర విమర్శలు చేయడం వంటి పనులతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ముప్పుతిప్పలు పెట్టిన తర్వాత జగదీప్ ధన్‌ఖడ్‌ను ఉపరాష్ట్రపతి వంటి కీలక పదవిలో నియమించారు. రెండు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో కనుమరుగై ఉన్న జగదీప్ ధన్‌ఖడ్‌ను నరేంద్రమోదీ ఏ కారణాలరీత్యా చేరదీశారో తెలియదు. అయితే అదే వ్యక్తిని అనూహ్యంగా పదవి నుంచి తప్పించడం లేదా తప్పుకుంటే చూస్తూ ఉండడం మాత్రం ఆశ్చర్యకరం. న్యాయవ్యవహారాల్లో ధన్‌ఖడ్ పెద్దగా నిపుణుడు కాదని, ఒకటి రెండు ముఖ్యమైన కేసులు తప్ప గొప్ప కేసులు ఏవీ వాదించిన దాఖలాలు లేవని అనేకమంది న్యాయ నిపుణుల అభిప్రాయం. అలాంటి వ్యక్తిని రాజ్యాంగ వ్యవహారాల్లో గొప్ప పరిజ్ఞానం ఉన్న వ్యక్తిగా ప్రశంసిస్తూ అనుభవజ్ఞుడైన వెంకయ్యనాయుడు స్థానంలో మోదీ నియమించినప్పుడు ఆశ్చర్యపోని ఎంపీలు లేరు. ఇప్పుడు ఆయనను తొలగించడం కూడా అంతే ఆశ్చర్యం కలిగిస్తోంది. రాజకీయాల్లో ఒక వ్యక్తి ఉత్థాన పతనాలు ఎలా జరుగుతాయన్నదానికి జగదీప్ ధన్‌ఖడ్ జీవితమే నిదర్శనం. గవర్నర్ పదవిలో ఉండగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ బలోపేతం కావడానికి కారకుడై, బీజేపీ ఏజెంట్‌గా ముద్రపడిన ధన్‌ఖడ్ రాజ్యసభ చైర్మన్‌గా కూడా దాదాపు బీజేపీ నాయకుడుగానే వ్యవహరించారు! ప్రతిపక్ష సభ్యులను ఎంతగా కట్టడి చేయాలో అంతగా కట్టడి చేశారు. విపక్ష సభ్యులు మాట్లాడుతుంటే మాటిమాటికీ అడ్డుతగిలేవారు. పార్లమెంట్‌లో గత ఏడాది భద్రతా వైఫల్యం జరిగినప్పుడు నిరసన తెలిపిన ప్రతిపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఒక దశలో ఆయనను తొలగించేందుకు ప్రతిపక్షాలు నోటీసు కూడా ఇచ్చాయి. పూర్వ ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్య ఒకసారి విందు ఇచ్చినప్పుడు 'మీ హయంలోనే పరిస్థితులు బాగుండేవి' అని పలువురు ప్రతిపక్షసభ్యులు ఆయన వద్ద వాపోయారు.

# ప్రగతి పనుల్లో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం



**రాష్ట్రంలో తొలిసారిగా పీపీపీ విధానంలో అమృత్ టెండర్లు**
**రూ.1,092 కోట్లతో మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులు**
**కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో టెండర్ వాయిదా**

నరసరావుపేట, జూలై 23 (టుడే విదుర): అమృత్ 2.0 పథకం కింద మున్సిపాలిటీల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులను భాగస్వామ్యం చేయనున్నది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల పరిధిలో అమృత్ 2.0 కింద రూ. 1,092.60 కోట్లతో చేపట్టే ప్రగతి పనుల కోసం ఒకే ప్యాకేజీ కింద ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ గత నెల 24న టెండర్ల ప్రక్రియ చేపట్టింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు పీపీపీ విధానంలో టెండర్లు పిలిచింది. ఈనెల 21న టెండర్లు దాఖలుకు చివరి తేదీగా నిర్ణయించింది. అయితే ఎవరూ టెండర్లు దాఖలు చేయకపోవడంతో వచ్చే నెల 7వ తేదీ వరకు గడువును పొడిగించింది.

# అరకు ఘాట్‌రోడ్డులో మినీ బస్సు బోల్తా

- ♦ డ్రైవర్ సహా ముగ్గురు పర్యాటకులకు తీవ్ర గాయాలు
- ♦ 14 మందికి స్వల్పగాయాలు
- ♦ క్షతగాత్రులు రాజమహేంద్రవరం వాసులు
- ♦ బస్సు బ్రేకులు ఫెయిలు కావడంతో ప్రమాదం




అనంతగిరి,జూలై 23 (టుడే విదుర):అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ఘాట్‌రోడ్డులో హెయిర్ పిన్ బెండ్-1 వద్ద సాయంత్రం ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సు బ్రేకులు ఫెయిలై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు రెండు చేతులు విరిగిపోగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 14 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా అరకు అందాలను తిలకించి రాజమహేంద్రవరం వెళు తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని ఓ బ్యూటీపార్లర్‌లో పని చేస్తున్న పది మంది యువకులు, యజమాని కుటుంబానికి చెందిన తొమ్మిది మంది అరకులోయ అందాలను తిలకించేందుకు ఓ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన మినీ బస్సులో వేకువజామున అరకులోయ వచ్చారు. అరకులోయ పరిసర ప్రాంతాలను తిలకించి, మధ్యాహ్నం బొర్రా గుహలు సందర్శించిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఘాట్‌రోడ్డు హెయిర్‌పిన్ బెండ్-1 మలుపు వద్దకు వచ్చే సరికి బస్సు బ్రేకులు ఫెయిలై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కుమారస్వామి రెండు చేతులు విరిగిపోగా, అందులో ఉన్న లక్ష్మి, గీత, వీరబాబు తీవ్రంగా గాయపడ్డారు. మిగతా 14 మందికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన నలుగురిని 108 వాహనంలో, మిగతా 14 మందిని ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

# అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగులు

**రోడ్డు ప్రమాదంలో కొల్లూరు యువకుడి బ్రెయిన్‌డెడ్**
**యలవర్తి ఆదిత్యసాయి కళ్లు,కిడ్నీలు, కాలేయం దానం**



తాడేపల్లి టౌన్, విజయవాడ,జూలై 23 (టుడే విదుర):: బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు అవయవ దానం ద్వారా నలుగురి జీవితాలలో వెలుగులు నింపనున్నాడు. బాపట్ల జిల్లా కొల్లూరుకు చెందిన యలవర్తి ఆదిత్యసాయి(22) ఈ నెల 19న బైక్‌పై ప్రయాణిస్తూ కొల్లూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురవడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆయనను తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించగా తలకు శస్త్రచికిత్స చేశారు. అయినప్పటికీ స్పృహలోకి రాకపోవడంతో 21వ తేదీన బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. అవయవ దానానికి కుటుంబసభ్యులు అంగీకరించడంతో ఏపీ జీవన్‌దాన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, మణిపాల్ ఆస్పత్రి క్లస్టర్ హెడ్ సుధాకర్ కంటెపూడి ఆధ్వర్యంలో అవయవాలను సేకరించారు. కళ్లను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి, ఒక కిడ్నీ, కాలేయాన్ని మణిపాల్ ఆస్పత్రికి, మరో కిడ్నీని క్యాపిటల్ ఆస్పత్రికి అందజేసినట్టు మణిపాల్ ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు.

# ఆర్టీసీ సిటీ బస్ సర్వీస్‌లు నడపాలి

**దివాన్‌చెరువులో కిక్కిరిసిన ఆర్టీసీ బస్‌లోకి ఎక్కుతున్న ప్రయాణికులు**
**దివాన్‌చెరువులో ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటున్న బస్సులు**
**కిక్కిరిసి, వేలాడుతూ ప్రయాణం చేస్తున్న విద్యార్థులు**




దివాన్‌చెరువు, జూలై 23 (టుడే విదుర): మహిళలు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల అవసరాలను పరిగణలోకి తీసుకుని ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరానికి సిటీబస్ సర్వీస్‌లు నడపాలని ప్రజలు కోరుతున్నారు. రాజానగరం, దివాన్‌చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న విశ్వవిద్యాలయాలు, వృత్తివిద్య కళాశాలలు, విద్యా సంస్థలతో ఈ ప్రాంతం విద్యా కేంద్రంగా ఉంది. అలాగే ఇక్కడకు సమీపంలోని కార్పొరేట్ ఆసుపత్రికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి రోగులు, బంధువులు వచ్చి వెళ్తుంటారు. దీనితో విద్యార్థులు, ఇతర ప్రయాణికులతో బాటు ఆయా సంస్థల్లో పనిచేసే కొంతమంది ఉద్యోగులు కూడా బస్సులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో బస్సులు రద్దీగా ఉంటున్నాయి. ఇక కార్యాలయాలు, విద్యాసంస్థలు ప్రారంభమయ్యే ఉదయం వేళల్లోనూ, పనివేళలు ముగిసే సాయంత్రం సమయాలలోనూ బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. కొంతమంది వేలాడుతూ వేలాడుతూ వెళ్తున్నారు. ఈ కారణంగా దూరప్రాంతాలకు ప్రయాణించవలసిన వారిలో కొంతమంది సీనియర్‌సిటిజన్లు, మహిళలు, దివ్యాంగులు వంటి వారు రద్దీగా ఉన్న బస్సుల్లో ప్రయాణించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం నుంచి రాజానగరం, కడియం, కోరుకొండ వంటి ప్రాంతాలకు రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లను కలుపుతూ సిటీ బస్సులు నడిపితే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందని పలువురు అంటున్నారు. రాష్ట్రంలోని కొన్ని నగరాల్లో ఆర్టీసీ సిటీబస్ సర్వీస్‌లు నడుపుతున్నందున ప్రజావసరాలను పరిగణలోనికి తీసుకుని రాజానగరం, దివాన్‌చెరువు తదితర పరిసర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరానికి సిటీ బస్‌లు నడపాలని దివాన్‌చెరువుకు చెందిన సామాజిక కార్యకర్త సూరారపు దేవిద్‌రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పల్నాడులో భూ బకాసురులు



♦ రూ.40 కోట్ల విలువైన భూమికి ఎసరు ♦ చనిపోయిన మనిషి బతికున్నట్లు చూపించారు
♦ 20 దొంగ రిజిస్ట్రేషన్లు చేసిన 'పేట' రిజిస్ట్రార్ ♦ ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దుర్వినియోగం
♦ చర్యలు తీసుకునేందుకు పోలీసులు ససేమిరా ♦ మంత్రి లోకేశ్ జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు

జూలై 23 (టుడే విదుర)::గుంటూరు నగరానికి చెందిన కొత్తపల్లి పద్మజ 2022 ఫిబ్రవరిలో క్యాన్సర్‌తో మృతిచెందారు. ఆమె పేరున గుంటూరు రూరల్ మండలం గోరంట్ల పంచాయతీ సర్వే నం.143లో 1.80 ఎకరాల భూమి ఉంది. భాష్యం రామసేతు క్యాంపస్ వద్ద ఉన్న ఈ భూమి విలువ అక్షరాలా రూ.40 కోట్లు. దీనిపై కన్నేసిన కొందరు కేటుగాళ్లు దాన్ని కాజేసేందుకు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల భూ మాఫియాను రంగంలోకి దించారు. మరణించిన పద్మజను బతికి ఉన్నట్లుగా చూపించారు. నరసరావుపేట రిజిస్ట్రార్‌తో 2023 అక్టోబరులో 18 జీపీఏలు (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేయించారు. అనంతరం ఆ భూమికి రిజిస్ట్రేషన్ చేసి రూ.కోట్లు దండుకున్నారు. దీనిపై పద్మజ భర్త కొత్తపల్లి శ్రీనివాసరావు 2024 జనవరిలోపోలీసులను ఆశ్రయించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో దీనిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ససేమిరా అన్నారు. చివరకు భూమిలో వాటా ఇస్తే కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఇటీవల మంత్రి లోకేశ్‌ను మంగళగిరి కార్యాలయంలో కలసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. స్పందించిన లోకేశ్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. దీంతో విచారణ ప్రారంభించిన నల్లపాడు పోలీసులు.. నిందితులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిజాలు నిగ్గు తేల్చారు.గుంటూరు పరిధిలోని భూమిని కొట్టేసేందుకు నిందితులు ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వాడుకున్నారు. భారీ మొత్తం ఆశ చూపించి రిజిస్ట్రార్‌తో 18 జీపీఏలు సహా 20 డాక్యుమెంట్లు రిజిస్టర్ చేయించారు. విషయం బయటకు పొక్కడంతో సదరు రిజిస్ట్రార్ కూడా నిందితులపై నరసరావుపేట పోలీసులకు అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉద్యోగ విరమణ చెందిన రిజిస్ట్రార్‌ను కూడా ఈ కేసులో చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కాగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చింతారెడ్డి మహేశ్‌రెడ్డి ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తేల్చారు. చనిపోయిన పద్మజ స్థానంలో ఓ వితంతువును చూపించి భూమికి జీపీఏలు తీసుకున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం మహేశ్‌రెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. పిడుగురాళ్ల మండలానికి చెందిన మరికొందరికి కూడా ఇందులో భాగస్వామ్యం ఉందని, వారే వితంతువును తీసుకొచ్చారని పోలీసు విచారణలో మహేశ్‌రెడ్డి తెలిపినట్లు సమాచారం. కొందరు రౌడీలతో బాధితుడు శ్రీనివాసరావుపై దాడికి కూడా దిగినట్లు చెబుతున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే నా భూమి దక్కేది కాదు. నాకు జరిగిన అన్యాయం గురించి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు పోలీసుల దగ్గరికి వెళ్లినా న్యాయం జరగలేదు. అదేమంటే వాటాలు అడిగారు. నా భూమిని ఆక్రమించి నాపై దాడికి వచ్చారు. మంత్రి లోకేశ్ జోక్యంతో నా ఫిర్యాదుపై కదలిక వచ్చింది. నిజాలు వెలుగులోకి తెచ్చారు.

## జక్కంపూడి రాజా హౌస్ అరెస్టు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 23 (టుడే విదుర): మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రాజమహేంద్రవరంలో ఏపీ పేపరుమిల్లు కార్మికులకు వేతన ఒప్పందం విషయంలో నుంచి నిరవధిక దీక్ష చేస్తానని ఆయన ప్రకటించారు.ఈ మేరకు తెల్లవారుజామున 3 గంటల సమయ ంలో త్రీటౌన్ పోలీసులు కృష్ణసాయి కల్యాణ మండపానికి చేరుకుని జక్కంపూడి రాజాను అదుపులోకి తీసుకుని దానవాయిపేటలోని ఆయన నివాసానికి తీసుకెళ్లి హౌస్ అరెస్టు చేశారు.మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ,మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, కౌడా మాజీ చైర్మన్ రాజిరెడ్డి, కర్రి పాపారాయుడు తదితరులు రాజా నివాసానికి చేరుకుని మద్దతుగా నిలిచారు.అనంతరం రాజా విలేకరులతో మాట్లాడుతూ పేపరుమిల్లు కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారు.రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు.

గడచిన ఐదేళ్లలో పేపరుమిల్లు కార్మికులకు వైసీపీ ప్రజాప్రతినిధులు ఎందుకు న్యాయం చేయలేకపోయారని టీడీపీ నేతలు యిన్నమూరి దీపు, నక్కా దేవి వరప్రసాద్ ప్రశ్నించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు పేపరుమిల్లు కార్మికుల కోసం దీక్షలు చేస్తామంటున్న వైసీపీ నాయకులు స్థానిక మా ర్గాని ఎస్టేట్ వద్ద చేస్తే బాగుంటుందన్నారు. ఎందుకంటే మిల్లు కార్మికులకు న్యాయం చేయకుండా పరంపర పేరుతో దోపిడీ చేసిన సొమ్ము భరత్ చేత కక్కించాలన్నారు. త్వరలో మిల్లు కార్మికులకు మంచి అగ్రి మెంట్ చేసేందుకు ఎమ్మెల్యే వాసు ,ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్ కృషి చేస్తుంటే ఇప్పుడు రాజకీయం చేయాలనుకోవడం తగదన్నారు.సమావేశంలో నాయకులు ఆ దారి లక్ష్మినారాయణ, చింతపల్లి నాని, కందికొండ అనంత్, జయరామ్ పాల్గొన్నారు.

## సబ్జెక్టుల్లో మార్కులు తగ్గుతుండడంపై ఆగ్రహం



కొమరోలు, జూలై 23 (టుడే విదుర): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి సబ్జెక్టుల్లో మార్కులు ఎందుకు తగ్గుతున్నాయంటూ ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్‌బీఎన్ఆర్ఎం ఎయిడెడ్, ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన టీచర్లు ఉండి కూడా పరీక్షల్లో మార్కులు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ప్రమాణాలను గుర్తించారు. మండలంలోని ఎస్‌బీఎన్ఆర్ఎం, ఏబీఎం పాఠశాలల రికార్డులను పరిశీలించారు. ఏబీఎం రికార్డుల్లో విద్యార్థుల సంఖ్య పదుల్లో ఉండగా నలుగురు మాత్రమే వచ్చారని హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించిన అనంతరం మళ్లీ వైసీపీ ప్రజాప్రతిని?ధులతో నిర్వహించడంపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో దానిపై గోప్యంగా విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు, ఎంఈవోలతో లిఖితపూర్వక లేఖలను తీసుకున్నారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తారని సమాచారం. డీఈవో వెంట ఎంఈవోలు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం ఉన్నారు.

## వ్యభిచార గృహ నిర్వాహకులను అరెస్ట్ చేయాలి



జూలై 23 (టుడే విదుర):కాకినాడ, పెద్దాపురం పెద్దాపురంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న వారిని గుర్తించి అరెస్టు చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి కోరారు. మహిళా సంఘాల ఐక్య వేదిక సభ్యులు ఎస్పి బిందుమాదవ్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను ఎస్పి దృష్టికి తీసుకువెళ్లారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే కేసు నమోదు చేసి సంబంధిత బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వ్యభిచార గృహ నిర్వాహకురాలు భారతికి సహకరించిన పోలీసులను గుర్తించి విధుల నుండి తొలగించి, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకో వాలని కోరారు. బాధిత మహిళకు పునరావాసం కల్పించాలని కోరారు. ఎస్పిని కలిసిన వారిలో ఐక్య వేదిక నాయకులు మంగాదేవి, వెంకటలక్ష్మి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు జి.భూలక్ష్మి ఉన్నారు. సిపిఎం పెద్దాపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావు, డిఎస్‌పి శ్రీహరిరాజులను సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి వ్యభిచార గహాలు నడుపుతున్న వారు, వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కడప సెంట్రల్ జైలులో ఖైదీల సెల్‌ఫోన్ వాడకం వాస్తవమే..

### ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు



కడప, జూలై 23 (టుడే విదుర): కడప సెంట్రల్ జైలులో ఖైదీలు సెల్‌ఫోన్ వాడుతున్నారన్నది వాస్తవమని తేలడంతో ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల కాలంలో జైలులో 12 ఫోన్లు దొరికాయి. సెల్‌ఫోన్ల వినియోగంపైో కథనం కూడా వచ్చింది. దీంతో ప్రభుత్వం కోస్తా రేంజ్ డీఐజీ రవికిరణ్‌ను విచారణాధికారిగా నియమించింది. ఆయన వారం రోజుల పాటు చేసిన విచారణలో సెల్‌ఫోన్ల వినియోగం వాస్తవమని తేలింది. దీనికి బాధ్యులుగా పరిగణిస్తూ డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్, జైలరు గోవిందరావు, జైలు వార్డర్లు అప్పారావు, వర్మ, నారాయణరావులను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డైరెక్టర్ అంజనీకుమార్ ఆదేశాలు జారీ చేశారు.

## సమ్మె పిలుపుతో దిగొచ్చిన ఆర్టీసి అధికారులు

పార్వతీపురం :జూలై 23 (టుడే విదుర): తమ డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేయనున్నట్టు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్ల సంఘం పిలుపునిచ్చింది. దీంతో సోమవారం రాత్రి స్థానిక ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్లు యూనియన్ నాయకులు, సిఐటియు నాయకులు, యజమానులు డిపో మేనేజర్ వద్ద జరిగిన చర్చల్లో స్వల్ప పురోగతి లభించింది. దీంతో డ్రైవర్లు సమ్మెను ఈనెల 28కి వాయిదా వేశారు. గత 20 రోజులుగా ఆర్టీసీ డ్రైవర్ల డిమాండ్లపై పోరాటం నేపథ్యంలో లేబర్ కమిషనర్ సువర్ణ వద్ద జరిగిన చర్చలు ఫలించలేదు. దీంతో డ్రైవర్లు సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఉదయం జిల్లా రవాణా అధికారి సమక్షంలో యూనియన్ నాయకులు, బస్సు యజమానులతో చర్చలు జరిగాయి. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరాము చర్చలకు హాజరయ్యారు. నాలుగేళ్ల నుంచి పెంచని జీతాలు పెంచేలా చూడాలని కోరారు. జిల్లా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావుతో యూనియన్ నాయకులు ఈనెల 21న సాయంత్రం చర్చలు జరిగాయి. డిమాండ్ల పత్రంలోని అంశాలు యజమానుల ముందుకు ఉంచగా ఆ రేట్లు ఇవ్వలేమని వారు స్పష్టం చేశారు. యజమానులంతా ఒటి చేసే డ్రైవర్‌కు రూ.16వేలు పెంచాలని కోరారు.

## ఏయూ హాస్టల్ విద్యార్థుల ఆందోళన




విశాఖపట్నం,జూలై 23 (టుడే విదుర): ఆంధ్ర విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు రాత్రి తొమ్మిది గంటలకు ఏయూ ప్రధానగేటు ముందు ఆందోళనకు దిగారు. వసతి గృహాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, ఫీజుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థులను వెనక్కి పంపించేందుకు యత్నించినా ససేమిరా అన్నారు. ఉన్నతాధికారులు వచ్చేంత వరకూ తాము కదిలేదని లేదని భీష్మించుకు కూర్చున్నారు. అయితే విద్యార్థులతో పోలీస్ అధికారులు చర్చలు జరపడంతో 11 గంటలకు ఆందోళన విరమించారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి



జూలై 23 (టుడే విదుర):మిడ్డే మీల్స్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, మండల కార్యదర్శి షేక్ పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మిడ్డే మీల్స్, స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్ల సంఘాల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పెంచిన మెనూ ఛార్జీల జిఒను అమలు చేయాలని, గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, వేతనాలు, బిల్లులు 5వ తేదీ లోపే ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గ్రామాల్లో రాజకీయ వేధింపుల ఆపాలని డిమాండ్ చేశారు. మిడ్డే మీల్స్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బి.అమ్మాజి, ఎం.దేవుడమ్మ ఎన్నికయ్యారు. స్కూల్ ఆయాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శు లుగా ఎ.వెంకటలక్ష్మి, ఇ.అప్పలనరస ఎన్నిక య్యారు. ఈ కార్యక్రమంలో ఎ.వరాలమ్మ, ఎస్.సత్యవతి, పి.సరస్వతి, పాల్గొన్నారు.

## హామీ కాదు..బతుకు తెరువు చూపాలి

-విజయనగరం టౌన్ :జూలై 23 (టుడే విదుర): 26ఏళ్లుగా రైతు బజారునే నమ్ముకుని బతుకుతున్న రైతులు తమ బతుకు తెరువుకోసం అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారు. విజయనగరం పాత ఆసుపత్రి స్థలం (సర్వే నెంబరు 166/1) లో ఉన్న రైతుబజారును ఖాళీ చేసి రాజుల కుటుంబానికి అప్పగించే ప్రక్రియ జిల్లా అధికార యంత్రాంగం చేపట్టింది. ఆ నాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను నేడు స్వీయ ప్రయోజనాల కోసం 50 మంది రైతులను రోడ్డు మీదకు నెట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం పూనుకుంది. గతంలో ప్రభుత్వ భూమి అని చెప్పి దానిని నేడు ప్రైవేటు భూమిగా జిల్లా అధికార యంత్రాంగం రికార్డుల్లో మార్పులు చేసి భూమిని కొల్లగొట్టేందుకు కావల్సిన ఏర్పాట్లు చేపట్టింది. దీంతో ఇటీవల కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఈనెల 15న కలెక్టర్‌ను కలిసిన తర్వాత అధికార యంత్రాంగం రైతు బజార్‌ను ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో ఆ రైతులంతా పేదలకు అండగా ఉండే పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తమ పొట్ట కొట్టొద్దని, బతుకు తెరువు కల్పించాలని కోరుతూ గత ఆరు రోజుల నుంచి రాత్రి పగలు రైతు బజార్ లోనే నివాసం ఏర్పాటు చేసుకొని పోరాడుతున్నారు. సిపిఎం, ప్రజా సంఘాలు,రైతుల పోరాటానికి అండగా నిలబడటంతో ఒక్కసారిగా రైతు బజార్ విషయం చర్చ నీయాంశంగా మారింది. వేల ఎకరాలు



భూమి ఉన్న రాజులు ఈ భూమిని చేజిక్కించుకునేందుకు చూడటం వెనుక ప్రజల నుంచి అనేక విమర్శలు వస్తున్నాయి. ఆరు రోజుల పోరాట ఫలితంగా రాజులపై వస్తున్న వ్యతిరేకత దృష్టిలో పెట్టుకొని రాయబారాలు నడుపుతున్నారు. దీంతో రైతులకు నష్టం జరగకుండా న్యాయం చేస్తామని, త్వరలో షెడ్ లు వేసి ప్రత్యామ్నాయ స్థలం లో ఏర్పాటు చేసి ఇస్తామని అధికార యంత్రాంగం నుంచి హామీలు ఇచ్చి ఆందోళన విరమించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ స్థలంలో. షెడ్ లు కట్టి ఇస్తామని చెబుతున్నప్పటికీ రైతు మాత్రం అందుకు సముఖంగా లేరు. ఇక్కడున్న 1.48 ఎకరాల్లో కనీసం 10 సెంట్లు రైతు బజార్ నిర్వహణకు విడిచిపెట్టి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## పారిశుధ్య పక్షోత్సవాలు ఎక్కడ



పాలకొండ: జూలై 23 (టుడే విదుర): ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య పక్షోత్సవాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా పలు గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా అ పనులు చేపట్టిన దాఖలాల్లేవు. ఇందుకు నిదర్శనం ఎక్కడిక్కడ చెత్తకుప్పలు, కాలువల్లో ప్రవహించాల్సిన మురుగునీరు రోడ్లుపై ప్రవహిస్తోంది. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లుపైనే చెత్త ఎక్కడికి అక్కడ దర్శనమిస్తుంది. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 20 వార్డుల్లో 354 వీధుల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. గురువుగారు వీధి, కోమటిపేట జంక్షన్, ఇందిరానగర్ కాలనీ, లుంబురు వారి వీధి జంక్షన్‌తో పాటు ప్రధాన రహదారుల్లోనూ రోడ్లపైనే చెత్తలు కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షాలు కురవడంతో మరింత బురదమయంగా మారుతుంది. దీనికి తోడు నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉంది. పట్టణం రోజురోజుకు విస్తరిస్తుంది. జనాభా సుమారు 40 వేలు పైబడి ఉంది. ఆ స్థాయిలో పారిశుధ్య కార్మికులు లేరు. కేవలం 46మందితోనే పారిశుధ్య నిర్వహణ జరుగుతుంది. పారిశుధ్య కార్మికులు ఉద్యోగులుగా రికార్డుల్లో నమోదై ఇతర పనులు చేస్తున్నారు. ఏదేమైనా నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణలో మాత్రం లోపం కనిపిస్తుంది.కానరాని పారిశుధ్య పక్షోత్సవాలువీరఘట్టం : స్థానిక మేజర్ పంచాయతీలో అపారిశుధ్యం తాడవిస్తోంది. పాత బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపై మురికి నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారి విస్తీర్ణ పనుల్లో భాగంగా పాత బస్టాండ్%ు%ఱ వెళ్లే మార్గంలో ఒకవైపు ఉన్న కాలువను పాత బస్టాండ్ వైపు మళ్లించారు. దీంతో చిన్నపాటి చినుకుపడ్డా ఈ కాలువ గుండా నీరు వెళ్లలేక రహదారిపై నిలిచిపోతుంది. కొంతమంది వ్యాపారులు కాలువపై అక్రమ కట్టడాలు నిర్మించడంతో వర్షం పడిన ప్రతిసారి ఇదే సమస్య ఏర్పడుతుంది స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే మేజర్ పంచాయతీ అధికారుల స్పందించి అక్రమణలను తొలగించి మురికి నీరు కాలువ గుండా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే పలు గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## దబ్బగెడ్డకు జ్వరమొచ్చింది



మక్కువ : జూలై 23 (టుడే విదుర):గత 25 రోజులుగా ఆ గ్రామాన్ని జ్వరం బెంబేలెత్తిస్తుంది. ఇంట్లో ఒకరి తర్వాత ఒకరిని ఇబ్బందులు పాలు చేస్తుంది. సుమారు 350 ఆవాసాలు గల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌ఎంపి వైద్యులను ఆశ్రయిస్తూ ఇంకా తగ్గుతుంటే పట్టణాలకు పోయి పరీక్షలు చేయించుకుని చికిత్స చేసుకుంటున్నారు. ఇటీవల ఓ ప్రైవేట్ సంస్థ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించింది. ప్రభుత్వ వైద్యాధికారులెవరు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే%శా%మండలంలోని దబ్బగెడ్డలో జ్వరాలు విజృభించాయి. ఈ గ్రామంలోని అందరి ఇళ్లల్లో ఒకరిద్దరు ఈ జ్వరం బారిన పడలేదని చెప్పుకోవడానికి లేదు. ఎక్కడి నుంచో ఓ వ్యక్తి ద్వారా ఈ జ్వరం వలస వచ్చిందని, ఇలాంటి జ్వరం తామెప్పుడూ చూడలేదని గ్రామస్తులు వాపోతున్నారు. జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, వాపులు విపరీతమైన నీరసం ఉందని అన్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి జ్వరాలు తగ్గించుకున్నా పూర్తిస్థాయిలో కోలుకోలేక నడవలేని స్థితి ఏర్పడుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరంతో బలివాడ గోవిందమ్మ, నారాయణమ్మ, లక్ష్మి, దాసరి వెంకటమ్మ, సాకేత్, హేమలత, నేరపిండి శ్రీను, కర్రి లీలావతి, వారణాసి తిరుపతిరావు, కలిశెట్టి సింహాచలవమ్మ, బూరి సరస్వతమ్మ, బండి గౌరమ్మ తదితరులు జ్వరంతో బాధపడుతున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటా రక్త నమోనాలు సేకరించి జ్వరాన్ని నయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## భారీ వర్షాలకు పొంగిన వాగు



కంచికచర్ల : జూలై 23 (టుడే విదుర): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలో చెవిటికల్లు వద్ద గల లక్ష్మయ్య వాగు వరద చేరింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుండి పలు దఫాలుగా వర్షం కురిసింది. రాత్రి తెరపివ్వకుండా వర్షం కురిసింది. దీంతో ఎగువ ప్రాంతాల్లో చిన్న వాగులు, పొలాల్లో నుండి వరద లక్ష్మయ్య వాగుకు చేరింది. ఈ వాగు వరద బుధవారం ఉదయం చెవిటికల్లు వద్ద రోడ్డుపై ప్రవహించింది. దీంతో ఈ రోడ్డు పై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతి యేటా జులై నెల నుంచి సెప్టెంబర్ వరకు ఏ చిన్నపాటి వర్షం వచ్చినా లక్ష్మయ్య వాగు కు వరద ఛేరి రాకపోకలు నిలిచిపోయాయి చెవిటికల్లు వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

## యువకుడు దారుణ హత్య



సాలూరురూరల్ : జూలై 23 (టుడే విదుర): తన మరదల్ని ప్రేమించొద్దని హెచ్చరించిన బావను ప్రేమికుడు హత్య చేసిన సంఘటన అర్ధరాత్రి మండలంలోని పురోహితునివలసలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదబోరబంద పంచాయతీ దేవుబుచ్చంపేటకు చెందిన ఆటో డ్రైవర్ గుంట్రెడ్డి శ్యామ్ గత కొన్నేళ్లుగా పురోహితునివలసకు చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక బావ షేక్ జలీల్ (26) శ్యామ్‌ను హెచ్చరించారు. బాలిక పురోహితునివలస ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్ చదువుతుండడంతో ప్రతిరోజు ఆమె వెంట శ్యామ్ పడుతున్న విషయం గ్రామంలో అందరికీ తెలిసింది. దీంతో కోపోద్రుకుడై జలీల్ మళ్లీ శ్యామ్‌ను వారం రోజుల కిందట తీవ్రంగా హెచ్చరించి నువ్వు ఇదే పద్ధతి కొనసాగిస్తే నిన్ను చంపడానికి కూడా వెనుకాడనని హెచ్చరించాడు. అయినా శ్యామ్ బుద్ధి మారకపోవడంతో రాత్రి 9గంటల సమయంలో షేక్ జలీల్ తన స్నేహితులతో కలిసి పురోహితునివలస ప్రాథమిక పాఠశాల పక్కన మద్యం సేవించి ఈరోజు ఎలాగైనా శ్యాముకు గట్టిగా మందలించాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం తన స్నేహితుల్లో ఒకర్ని దేవుబుచ్చంపేట పంపించి శ్యామును పురోహితునివలసకు రప్పించాడు. అంతా కలిసి మద్యం సేవించారు. షేక్ జలీల్ శ్యామ్‌ను భయపెట్టడానికి పథకం ప్రకారం ఒక కత్తిని కూడా తన వెంట తెచ్చుకున్నాడు. ఆ కత్తితో శ్యామ్‌పై దాడి చేయగా అదే కత్తిని శ్యామ్ తీసుకొని జలీల్ పొట్టపై పొడిచి హత్య చేశాడు. షేక్ జలీల్ అక్కడికక్కడే మరణించాడు.

## బాలుర కాలేజీ హాస్టల్ కష్టాలు



నందిగామ : జూలై 23 (టుడే విదుర): నందిగామ పట్టణంలో అశోక్ నగర్ ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర కాలేజీ హాస్టల్ నందు విద్యార్థులకు ప్రతిరోజు మెనూ నాణ్యత లోపాలుగా ఉంటుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, కూర, మజ్జిగ అందటం లేదు. నీళ్లమజ్జిగ పో స్తున్నారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో ఉండటం లేదు. సమయపాలన పాటించడం లేదు. పోన్ చేసిన స్పందించడం లేదు. విద్యార్థులకు భోజనం వడ్డించే సమయంలో కూడా వార్డెన్ ఉండటం లేదని ఆరోపణ వ్యక్తం అవుతున్నాయి. వార్డెన్ తిరువూరు నుండి రావడం వల్ల విద్యార్థులపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయింది. సాంఘిక సంక్షేమ బాలుర కాలేజీ హాస్టల్ నందు 45 నుండి 50 మంది విద్యార్థులకు పైగా ఉన్నారు. మెనూ తక్కువ హాజరు శాతం ఎక్కువ. నందిగామ పట్టణంలో పలు ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు బోజన వసతి సరిగా లేకపోవడంతో వారు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ప్రతిరోజు కోడిగుడ్డు ఇవ్వవలసి ఉండగా వారంలో రెండు మూడు రోజులు మాత్రమే ఇచ్చి సరిపెడుతున్నారు. సాంబారు, పప్పు రుచి పసి లేకుండా ఉండడంతో విద్యార్థులు అన్నం తినకుండానే పక్కన పారే స్తున్నారు. 100 గ్రాములు చికెన్ వారానికి రెండు రోజులు చొప్పున విద్యార్థులకు ఇవ్వాల్సి ఉండగా 50 గ్రాములు లోపు మాత్రమే నాణ్యత లోపంగా ఉడికి ఉడకని చికెన్ పెడుతున్నారని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. అరటి కాయ, రాగిజావ ఇవ్వడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం పూట టిఫిన్ సకాలంలో అందటం లేదు. పూరి నాణ్యత లోపంగా ఉంది. గోధుమ పిండి కంటే మైదా పిండి ఎక్కువ కలిపి పూరి ఇవ్వడం వల్ల కడుపునొప్పితో బాధపడుతున్నామని ఒక విద్యార్థి ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది.

# వచ్చే ఏడాది మార్చిలో యాదాద్రి థర్మల్ ప్లాంట్ పూర్తి



హైదరాబాద్, జూలై 23 (టుడే విదుర): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్లన్నీ 2026 మార్చిలో అందుబాటులోకి రానున్నాయని కేంద్ర విద్యుత్ సంస్థ(సీఈఏ) ప్రకటించింది. ఈ మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి థర్మల్ కేంద్రాల నిర్మాణ పురోగతిపై రెండో త్రైమాసిక నివేదికను విడుదల చేసింది. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో భాగంగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన చివరి యూనిట్-5.. 2026 మార్చిలో వాణిజ్య ఉత్పత్తి(సీవోడీ) ప్రారంభించనుందని పేర్కొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెంలో 4000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఒక్కోటి 800 మెగావాట్లు కలిగిన ఐదు యూనిట్లను తెలంగాణ జెన్‌కో నిర్మిస్తోంది. ఇప్పటికే రెండు యూనిట్లు(1-2) విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా.. మూడో యూనిట్ రానున్న డిసెంబరు కల్లా, నాలుగో యూనిట్ అక్టోబరు కల్లా, ఐదో యూనిట్ 2026 మార్చికల్లా పూర్తయితే.. ఒకేచోట 4 వేల మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ కలిగిన ప్రాంతంగా వీర్లపాలెం రికార్డులకు ఎక్కనుంది.

# ఇప్పటికిప్పుడే.. ఇక్కడికిక్కడే..పెళ్లాడతావా.. చావమంటావా

## భువనగిరి బస్టాండ్‌లో సుదీర్ఘ హైడ్రామా పోలీసుల కౌన్సెలింగ్‌తో సమసిన వివాదం




భువనగిరి టౌన్, జూలై 23 (టుడే విదుర): ఇప్పుడే వివాహం చేసుకుందాం.. లేదంటే బస్సు కింద పడి ఆత్మహత్య చేసుకుంటా"నంటూ ఓ విద్యార్థిని బెదిరింపులు.. ఆమె ఎంతగా బలవంతపెట్టినా పెళ్లికి ససేమిరా అన్న విద్యార్థి! భువనగిరి బస్టాండ్‌లో మధ్యాహ్నం మొదలైన ఈ హైడ్రామా.. రాత్రి దాకా కొనసాగి.. ఎట్టకేలకు పోలీసుల జోక్యంతో ముగిసింది. సిద్దిపేట జిల్లాకు చెందిన ఆ విద్యార్థిని.. రంగారెడ్డి జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతోంది. అదే కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి(సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలవాసి)తో ఆమెకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ హైదరాబాద్ పరిసరాల్లోని వేర్వేరు హాస్టల్స్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. భువనగిరి బస్టాండ్‌లో కలుసుకున్నారు. తిరిగి వెళ్లాల్సిన సమయంలో.. "నిన్ను వదిలి నేను వెళ్లను. ఇప్పుడే పెళ్లి చేసుకుందాం" అని విద్యార్థిని మొండికేసింది. దానికి ఆ విద్యార్థి.. "ఇప్పుడే వద్దు. జీవితంలో స్థిరపడ్డాకే చేసుకుందాం" అని వేడుకున్నాడు. ఇలా ఇద్దరి మధ్య వివాదం రాత్రి దాకా కొనసాగింది. అయినా సయోధ్య కుదరకపోగా ఆమె బస్సు కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం మొదలుపెట్టింది. వీరిద్దరి కదలికలను ఉదయం నుంచి గమనిస్తున్న బస్టాండ్ పారిశుధ్య కార్మికులు, ఆర్టీసి సిబ్బంది, బస్టాండ్ చెక్ పోస్ట్ కానిస్టేబుల్‌తో పాటు మరికొందరు వారిని మందలించి అక్కణ్నుంచి పంపే ప్రయత్నాలు చేశారు. వారి కుటుంబాలకు సమాచారం ఇచ్చేందుకు ఫోన్ నంబర్లు అడిగారు. కానీ ఇద్దరూ ఇవ్వలేదు. దీంతో వారు ఆ జంటను పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిర్వహించిన కౌన్సెలింగ్‌తో ఇద్దరూ ఇళ్లకు వెళ్లిపోయారు.

# రోడ్డెక్కిన రైతన్న.. సాగునీటి కోసం కథలాపూర్‌లో భారీ ధర్నా



కథలాపూర్, జూలై 23 (టుడే విదుర): సాగునీటి కోసం కథలాపూర్ మండల రైతులు రోడ్డెక్కారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సుమారు 500 మంది మండల కేంద్రానికి తరలివచ్చారు. కోరుట్ల-వేములవాడ రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేశారు. బీమారం మండలం మన్నెగూడెం రైతులు కూడా పాల్గొన్నారు. వరదకాలువలో నీళ్లుంటాయనే నమ్మకంతో తాము నార్లు పోసుకున్నామని, మడులు సిద్ధం చేసుకొని నాట్లు వేసుకుందామంటే నీళ్లు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా వరదకాలువలోకి నీటిని విడుదల చేసి తమ పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని నినాదాలు చేశారు. రైతుల ధర్నాతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోగా, సంఘటన స్థలానికి కోరుట్ల సీఐ సురేశ్‌బాబు చేరుకొని రైతులతో మాట్లాడారు. ధర్నా విరమించాలని కోరగా, వరదకాలువ ద్వారా నీళ్లిస్తేనే విరమిస్తామని రైతులు తేల్చిచెప్పారు.%అనంతరం తహసీల్దార్ వినోద్ వచ్చి రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. వినకపోవడంతో కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. రెండు రోజుల్లో వరదకాలువ ద్వారా నీటిని విడుదల చేస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ధర్నాలో మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య వంటావార్పు చేసేందుకు భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జడ్పీటీసీ నాగం భూయయ్య, రైతులు, నాయకులు గడ్డం భూమారెడ్డి, గుండారపు గంగాధర్, వర్ధినేని నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్, బద్దం మహేందర్‌రెడ్డి, పిడుగు ఆనంద్‌రెడ్డి, కంటె సత్యనారాయణ ఎండీ రఫీ, శ్రీకాంత్‌రెడ్డి, గంగారెడ్డి, రాజారెడ్డి, రాజం తదితరులు పాల్గొన్నారు.

# పడిపోయిన సన్న బియ్యం ధరలు




జగిత్యాల, జూలై 23 (టుడే విదుర): జిల్లాలోని మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు తగ్గాయి. సర్కారు బోనస్ ప్రకటనతో ఈసారి సన్న వడ్ల సాగు పెరగడం, మూడు నెలల రేషన్ కింద ప్రభుత్వం సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడంతో మార్కెట్‌లో సన్నబియ్యం రేట్లు భారీగా తగ్గినట్లుగా వ్యాపార వర్గాలు అంటున్నాయి. అన్ని రకాల బియ్యంపై సుమారు రూ.500 వరకు తగ్గడంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఏ రకమైనా క్వింటాల్ బియ్యం రూ.4,000 నుంచి 4,600 మధ్య దొరుకుతున్నాయి. జిల్లాలో వరి సాగు విస్తీర్ణం పెరగడంతో ధాన్యం దిగుబడి భారీగా పెరిగింది. ఫలితంగా సప్లయ్‌కి తగ్గ డిమాండ్ లేకపోవడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. జూన్ నుంచి క్రమంగా తగ్గుతున్న బియ్యం ధరలు జూలై మూడో వారం వరకు భారీగా పడిపోయాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురిలతో పాటు ఇతర ప్రాంతాల మార్కెట్‌లలో సైతం బియ్యం ధరలు తగ్గుముఖం పట్టాయి.తగ్గిన ధరలు మధ్య తరగతి వినియోగదారులకు ఊరట కలిగిస్తున్నప్పటికీ బహిరంగ మార్కెట్‌లో బియ్యం వ్యాపారులకు గిరాకీ సుమారు పాతిక శాతానికి పైగా పడిపోయింది. ప్రధాన పట్టణాల్లో రోజూవారీ కొనుగోళ్లు భారీగా తగ్గాయని, కొన్ని ప్రాంతాల్లో రైస్ షాపులకు బోనీ కూడా లేని పరిస్థితి నెలకొందని వ్యాపారులు వాపోతున్నారు. భవిష్యత్‌లో బియ్యం షాపులు మూత పడి మాల్స్‌లోనే బియ్యం కొనుగోలు చేసే పరిస్థితి వస్తుందని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# యూరియా కోసం పడిగాపులు.. వెంకటాపూర్‌లో బారులు తీరిన రైతులు



ఎల్లారెడ్డిపేట,జూలై 23 (టుడే విదుర): యూరియా కోసం రైతులు గోస పడుతూనే ఉన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని పీఏసీఎస్ గోదాం వద్ద పడిగాపులు కాశారు. నాడు జీలుగ విత్తనాల కోసం ఇబ్బందులు పడితే, ఇప్పుడు నాట్లేసి నెల రోజులైనా యూరియా రాక ఇబ్బందులు పడ్డారు. రెండు రోజుల క్రితం 450 బస్తాలతో యూరియా లోడ్ వచ్చిన విషయం తెలుసుకున్న మూడు గ్రామాల రైతులు బారులు తీరారు. ఒకే లోడు వచ్చిందని, మళ్లీ లోడ్ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఒక ఎకరానికి ఒక బస్తా ఇవ్వగా, చాలా మంది రైతులకు అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. దీనిపై ఏవో రాజశేఖర్‌ను సంప్రదించగా, ఇంకా రెండు లోడ్లు అయితే సరిపోతుందని, ఇండెంట్ పెట్టామని, రెండు రోజుల్లో వస్తుందని తెలిపారు.

# వాట్సాప్ చాటింగ్ వివాదం: ఒకరి హత్య



సూర్యాపేట టౌన్, జూలై 23 (టుడే విదుర):పద్మశాలీ సంఘం ఎన్నికలపై వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్‌కు స్పందించిన వివాదం ఒక వ్యక్తి దారుణ హత్యకు దారి తీసిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారంసూర్యాపేట పట్టణానికి చెందిన మానుపురి కృపాకర్(48) చెప్పుల వ్యాపారం నిర్వహిస్తుంటారు. వచ్చేనెల 3న నిర్వహించనున్న పద్మశాలీ సంఘం ఎన్నికలకు సంబంధించి ఆ సంఘం జిల్లా అధ్యక్షు డు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్ సంఘానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టారు.%దానికి కృపాకర్ క్లాప్స్ కొడుతూ రీపోస్టు పెట్టాడు. దీనిని జీర్ణించుకోలేని అదే కులానికి చెందిన మరోవర్గం నాయకుడు రాములు నువ్వు అలా ఎందుకు స్పందించావంటూ రాత్రి కృపాకర్‌కు ఫోన్ చేసి బండబూతులు తిట్టి చంపుతానని బెదిరించారు. ఈ విషయంపై కులపెద్దలకు ఫోన్‌లోనే ఫిర్యాదు చేశారు. కులసంఘం ఎన్నికల ఇన్‌చార్జికి, కులపెద్దలకు ఫిర్యాదు చేసి వారి సంక్షేమం లో సమస్యను పరిష్కరించేందుకు కులసంఘం భవనానికి వెళ్లారు.అప్పటికే పద్మశాలీ భవనం వద్ద ఉన్న శ్రీరాముల రాములు అతడి కుమారుడు ధనుంజయ్‌లతోపాటు మరో నలుగురు వ్యక్తులు కృపాకర్‌పై దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన కృపాకర్‌ను వారే చికిత్స నిమిత్తం ఏరియా దవాఖానకు తరలించగా మార్గమధ్యంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. అందరితో కలివిడిగా ఉంటే వ్యక్తి హత్యకు గురి కావడంపై ఏరియా దవాఖానలో బం ధుమిత్రుల రోదనలు మిన్నంటాయి.

# బంగారం చోరీ కేసులో పురోగతి

## యూపీ దొంగల ముఠా పనేనని పోలీసుల ప్రాథమిక అంచనా
## రెండు నెలలుగా రెక్కీ నిర్వహించిన దొంగలు
## నిందితుల కోసం ఐదు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్న పోలీసులు
## ఉత్తరప్రదేశ్‌కు వెళ్లిన రెండు పోలీసు బృందాలు



సూర్యాపేట టౌన్, జూలై 23 (టుడే విదుర):రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి సంతోషి జ్యూయలరీ దుకాణం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దొం గల ముఠా ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. దొంగల ముఠాకు చెందిన ఐదుగురు వ్యక్తులు రెండు నెలల కిం దట పట్టణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జ్యూయలరీ షాప్ సమీపంలోని నిర్మల మాత చర్చి వద్ద పాడుపడిన ఇంట్లో రెండు గదులను అద్దెకు తీసుకున్నారు.దుకాణాల వద్ద కాపలాదారులుగా ఉన్న వాచ్‌మెన్‌తో మాట్లాడుతూ పక్కగా రెక్కీ నిర్వహించి దోపిడీకి పాల్పడినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి సమపంలోని కిరాణ దుకాణంలో వాటర్ బాటిల్స్, గుట్కా ప్యాకెట్స్‌ను ముఠా కొనుగోలు చేసింది. ముఠా సభ్యులు అద్దె ఇంటిని సంపాదించడానికి స్థానిక యువకుల సహకారం తీసుకుంది.

# పండితాపురంలో విషాదం.. ఉరేసుకొని యువతీ, యువకుడు ఆత్మహత్య



కారేపల్లి (కామేపల్లి), జూజూలై 23 (టుడే విదుర):ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం విషాదం నెలకొంది. ఒకే గ్రామానికి చెందిన యువతి, యువకుడు వేర్వేరుగా ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటన రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పండితాపురానికి చెందిన గాడిపల్లి శ్రీకాంత్(24) గ్రామ సమీపంలోని పంట చేలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.%ఈ సంఘటన జరిగిన కొద్ది సేపటికే శ్రీకాంత్ ఇంటి పక్కనే నివసించే బండి హారిక (19) కుటుంబసభ్యులు ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇద్దరి మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయిన ఇద్దరి మృతదేహాలను కామేపల్లి పోలీసులు ఖమ్మం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

# టుడే వినోదం



## ముంబై ఫిల్మ్స్ ఫెస్టివల్ 2025 రద్దు.. అధికారిక ప్రకటన




%భారతీయ సినీ పరిశ్రమలో ఓ అరుదైన సంఘటన జరిగింది. సుమారు మూడు దశాబ్దాలుగా విజయవంతంగా నిర్వహిస్తూ వస్తోన్న మామి ముంబై ఫిల్మ్ ఫెస్టివల్ ఈ సంవత్సరం జరగదని నిర్వాహకులు సోమవారం ఉదయం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఫెస్టివల్ డైరెక్టర్ శివేంద్ర సింగ్ దుంగర్పూర్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. %ఆ పోస్టులో.. 2025 ఎడిషన్ రద్దు చేస్తున్నాం. త్వరలో కొత్త టీమ్ చేరబోతుందని, వారి నేతృత్వంలో ఈ ఫెస్టివల్‌ను మరింత అద్భుతంగా మార్చడానికి కృషి చేస్తున్నాం. ఇండియా నుంచే కాక ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే అనేక ఇండిపెండెంట్, ప్రాంతీయ, క్లాసిక్ సినిమాలకు ఈ ఫెస్టివల్ కేంద్రంగా అగ్రస్థానంలో నిలబడేలా ప్రయత్నిస్తామని అన్నారు. తిరిగి.. ఫెస్టివల్ 2026లో ఉంటుందని, కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. %కాగా.. 2025 ఫెస్టివల్ రద్దు కావడంపై అనేక మంది సినీ లవర్స్ నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. సినీ, ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబైకి తన స్వంత ఫిల్మ్ ఫెస్టివల్ కూడా నిర్వహించలేక పోవడం విచిత్రంగా ఉందని అంటున్నారు. కేన్స్, రెడ్ కార్పెట్ అంటూ విదేశాల ఫెస్టివల్స్‌కు పరుగులు పెట్టినవారు ఇప్పుడు తమసొంత ఫిలిం ఫెస్టివల్‌ను గాలికొదిలేశారంటూ విమర్శలు వస్తున్నాయి. ఇదిలాఉంటే.. 1997లో ముంబై అకాడమీ ఆఫ్ మూవింగ్ ఇమేజ్ ఈ ఫెస్టివల్‌ను ప్రారంభించగా ఆమీర్ ఖాన్ వంటి స్టార్‌లు ఆర్థికంగా సాయం చేశారు. ప్రియాంక చోప్రా, కిరణ్ రావ్‌లు చైర్‌పర్సన్‌లుగా పనిచేశారు.

## పవన్ కళ్యాణ్ మూవీలో బ్రహ్మానందం పాత్ర ఏమిటీ...





సినిమా ఫంక్షన్స్ కు యాంకరింగ్ చేయడం అంత ఈజీ కాదు... ఆ సినిమా గురించి, అందులో నటించే నటీనటులు గురించి సాంకేతిక నిపుణుల గురించి, నిర్మాణ సంస్థ గురించి బోలెడన్ని విషయాలు తెలిసి ఉండాలి. చివరి నిమిషంలో అతిథుల విషయంలో జరిగే మార్పులు చేర్పులను గుర్తించి, అందుకు అనువుగా ప్రిపేర్ కావాలి. ఇలాంటి విషయంలో లక్షల రెమ్యూనరేషన్ తీసుకున్నా సుమ )ను సినిమా వాళ్ళు ప్రిఫర్ చేస్తారు. ఫుల్ జోష్ తో, చలాకీగా కార్యక్రమాన్ని నడపడమే కాదు... సమయస్ఫూర్తితో సుమ ప్రోగ్రామ్ ను రక్తికట్టిస్తుంది. పైగా సినిమా రంగంతో దశాబ్దాల అనుబంధం ఉన్న కారణంగా ఆమెకు అనేక విషయాలు, అనేక మంది విషయాలు కరతలామలకం. అయితే... ఒక్కోసారి సుమలోని కాన్ఫిడెన్స్ ఓవర్ కాన్ఫిడెన్స్ గా మారిపోతుంది. సరైన సమాచారాన్ని నిర్వాహకులు ఇవ్వకపోవడంతో కొన్ని తప్పులూ జరిగిపోతుంటాయి. మరీ ముఖ్యంగా పదాలను వరదలా ఉపయోగిస్తూ ఒక్కోసారి సుమ భంగపాటుకూ గురౌతుంది. మరీ అంత తప్పుపట్టాల్సిన విషయం కాదు గానీ సుమ 'హరిహర వీరమల్లు' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో బ్రహ్మానందం ను ఆకాశానికి ఎత్తేస్తూ... 'ద డైనమిక్, ద యంగ్, ద ఎనర్జిటిక్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, గిన్నిస్ బుక్ విజేత... బ్రహ్మానందం డిఫరెంట్ క్యారెక్టర్ అండ్ క్యారెక్టరైజేషన్ ఈ సినిమాలో అలరించడానికి సిద్ధమైపోయారు' అంటూ వేదిక మీదకు ఆహ్వానించింది.

## కూలీ నుంచి 'పవర్‌హౌస్' లిరిక్ వీడియో.. రజనీ ఫ్యాన్స్‌లో ఫుల్ హైప్




థలైవర్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో, సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియన్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం కూలీ. నాగార్జున, అమీర్ ఖాన్, షౌబీన్ షాహీర్, శీతి హాసన్ కీలక పాత్రల్లో నటించారు. ఆగష్టు15న మరో 20 రోజుల్లో థియేటర్లకు రానుంది. ఈ క్రమంలో మేకర్స్ ప్రచార కార్యక్రమాలు ప్రారంభించి హోరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే విడుదల చేసిన పాటలు సినిమాపై మంచి హైప్ తీసుకు రాగా గత వారం విడుదల చేసి మోనిక సాంగ్ టోటల్ ఇండియానే షేక్ చేస్తుంది. %అయితే.. తాజాగా హైదరాబాద్‌లో ప్రత్యేక ఈవెంట్ నిర్వహించి పవర్ హౌస్ అనే వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. అరివు ఈ పాటకు సాహిత్యం అందించగా సంగీత దర్శకుడు అనిరుద్ రవిచందర్ తతో కలిసి ఆలపించారు. ఫుల్ బాస్ బీట్స్, ర్యాప్ టచ్ తో సాగే ఈ పాట మాస్ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతోంది. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ సాధించింది.




## సూర్య డ్యూయల్ షేడ్స్.. కరుప్పు టీజర్‌లో మాస్ ఫీస్ట్!

కొలీవుడ్ స్టార్ హీరో సూర్య, త్రిష జంటగా తమిళంలో రూపొందుతున్న చిత్రం కరుప్పు దీపావళికి ప్రేక్షకుల థియేటర్లకు రానుంది. ఈ రోజు (జూలై, 23) సూర్య జన్మదినాన్ని పురస్కరించుకుని మేకర్స్ తమిళంతో పాటు అన్ని భాషల్లో టీజర్ విడుదల చేశారు. ఈ టీజర్‌ను పరిశీలిస్తే సూర్య ఈ చిత్రంలో రెండు రకాల షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తోన్నట్లు తెలుస్తోంది. టీజర్‌లో సూర్య కొత్త లుక్, యాక్షన్ సీక్వెన్స్‌లు, డ్యూయల్ షేడ్స్ ఫ్యాన్స్‌ని ఫుల్ ఎక్సైటెడ్ చేశాయి. గతంలో నయనతారతో ముక్కు పుడక అమ్మోరు తల్లి అనే చిత్రాన్ని రూపొందించిన ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నాడు.

## ఫ్రెండ్ భర్తతో ప్రేమ పెళ్లి.. మూడేళ్లకే విడాకులు




అందాల భామ హన్సిక మోత్వానీ ( గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలనటిగా కెరీర్ ను మొదలుపెట్టిన ఈ భామ హీరోయిన్ గా స్టార్ హీరోల సరసనా నటించి మెప్పించింది. దేశముదురు సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టి.. మొదటి సినిమాతోనే కుర్రకారు గుండెల్లో బబ్లీ బ్యూటీగా ముద్ర వేసుకుంది. ఈ సినిమా తరువాత కుర్ర హీరోల సరసన నటించి టాప్ హీరోయిన్ గా మారాలనుకుంది. కానీ, అది జరగలేదు. %ఇక తెలుగును వదిలి తమిళ్ కు వెళ్లిన ఈ బ్యూటీ అక్కడ సినిమాలతో పాటు.. శింబు ప్రేమలో కూడా పడింది. సరే వీరిద్దరూ పెళ్లి చేసుకుంటారేమో అనుకుంటే.. కొన్నేళ్ళకే బ్రేకప్ చెప్పేసుకున్నారు. ఇక అయినా కూడా హన్సిక ధైర్యంగా నిలబడి.. సినిమాలుచేస్తూనే వచ్చింది. బొద్దుగా ఉన్న భామ బక్కచిక్కి మారినంత అందంగా తయారయ్యింది.

## అప్పుడు అలా... ఇప్పుడు ఇలా...




కొన్ని సినిమాల్లోని ట్విస్టులు నమ్మశక్యంగా ఉండవు. కానీ నిజ జీవితంలోని ట్విస్టులతో పోల్చితే సినిమాల్లోని మలుపులు నథింగ్! ప్రముఖ మలయాళ నటుడు షైన్ టామ్ చాకో) జీవితంలో జరుగుతున్న సంఘటనలు సైతం అలాంటివే. నటుడిగా మలయాళంలోనే కాదు... తమిళ, తెలుగు భాషల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్న సమయంలో షైన్ టామ్ చాకో కెరీర్ పై నీలినీడలు అలుముకున్నాయి. సినిమాల్లో నటించే సమయంలోనూ అతను డ్రగ్స్ ను వాడుతుంటాడని ప్రత్యక్ష సాక్షులు కొందరు చెప్పారు. అతని సహ నటీనటులైతే, ఆ విషయాన్ని ధృవీకరించారు. కొందరు అతని ప్రవర్తన అనుచితంగా ఉందంటూ కేసులూ పెట్టారు. ఆ మధ్య పోలీసులు అరెస్ట్ చేసి, విచారణ జరిపి బెయిల్ మీద విడుదల చేశారు.

# టుడే బిజినెస్

## ఇండియా-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం..




భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మరొకొన్ని గంటల్లో పూర్తి కాబోతోంది. ప్రధాని మోదీ తన ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా గురువారం నాడు ఈ ఒప్పందంపై సంతకం చేయబోతున్నారు. ఇరు దేశాల మధ్య ఇది సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంగా నిలవబోతోంది. 2030 నాటికి ఈ రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని 120 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించుకున్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల్లో పలు రంగాలు లాభపడబోతున్నాయి యూకేలో ప్రస్తుతం వెయ్యికి పైగా భారతీయ కంపెనీలు కార్యకలాపాలను సాగిస్తున్నాయి. వీటిల్లో లక్ష మందికి పైగా పని చేస్తున్నారు. భారతీయ పారిశ్రామిక వేత్తలు యూకేలో 1.73 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారు. ఇక, భారత్‌లో యూకే పారిశ్రామికవేత్తలు 3.11 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టారు. భారత్‌లో యూకే ఆరో అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుగా నిలిచింది. కాగా, ఈ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ బ్రిటిష్ పార్లమెంట్, భారత కేంద్ర మంత్రివర్గం నుంచి చట్టపరమైన అనుమతులు పొందిన తర్వాత, ఒక సంవత్సరంలోపు అమల్లోకి వస్తుందని భావిస్తున్నారు.

## కళానిధి మారన్, కేఏఎల్ ఎయిర్‌వేస్‌లకు సుప్రీంకోర్టు షాక్..
## రూ.1300 కోట్ల నష్టపరిహారం తిరస్కరణ




సుప్రీంకోర్టు జూలై 23, 2025న ఇచ్చిన తీర్పుతో కళానిధి మారన్ ఆధ్వర్యంలోని కేఏఎల్ ఎయిర్‌వేస్‌కుగట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్‌పై రూ.1300 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేఏఎల్ ఎయిర్‌వేస్ దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పు ఢిల్లీ హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. ఢిల్లీ హైకోర్టు మే 23, 2024న కేఏఎల్ ఎయిర్‌వేస్ క్లెయిమ్‌ను పక్కా ప్రణాళికతో కూడిన జూదం అని, వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచడం జరిగిందని పేర్కొంటూ తిరస్కరించింది.కళానిధి మారన్, స్పైస్‌జెట్ మధ్య 2015 నుంచి ప్రమోటర్ల వివాదం నడుస్తోంది. ఈ వివాదం స్పైస్‌జెట్‌లో మారన్ యాజమాన్య హక్కులు, షేర్ల బదిలీ, ఆర్థిక లావాదేవీల చుట్టూ తిరుగుతోంది. ఆ క్రమంలోనే కేఏఎల్ ఎయిర్‌వేస్, స్పైస్‌జెట్‌పై రూ.1300 కోట్ల నష్టపరిహారం కోరుతూ ఢిల్లీ హైకోర్టులో కేసు వేసింది. అయితే, ఈ క్లెయిమ్‌ను హైకోర్టు తిరస్కరించడంతో, మారన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ, సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును ధృవీకరించడంతో మారన్‌కు మరోసారి నిరాశే ఎదురైంది.గతంలో, ఒక ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ కూడా కేఏఎల్ ఎయిర్‌వేస్ రూ.1300 కోట్ల నష్టపరిహారం క్లెయిమ్‌ను తోసిపుచ్చింది. ఈ తీర్పు కేఏఎల్ ఎయిర్‌వేస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది. అయినప్పటికీ, మే 2024లో కళానిధి మారన్, కేఏఎల్ ఎయిర్‌వేస్ మరోసారి స్పైస్‌జెట్ దాని ఛైర్మన్ అజయ్ సింగ్‌పై రూ.1,323 కోట్ల నష్టపరిహారం కోరుతూ కేసు వేశారు. అదనంగా, రూ.353.50 కోట్ల బకాయిలను కూడా వసూలు చేయాలని వారు కోరారు.

## అమెరికా-జపాన్ ట్రేడ్ డీల్ ఫిక్స్..
## లాభాల్లో మార్కెట్లు..




జపాన్‌తో ట్రేడ్ డీల్ ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడంతో ఆసియా-పసిఫిక్ మార్కెట్లు లాభాల బాటలో సాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు కూడా దేశీయ సూచీలపై పాజిటివ్ ప్రభావం చూపిస్తున్నాయి. మంగళవారం ఒడిదుడుకులు ఎదుర్కొన్నా సూచీలు బుధవారం స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి మంగళవారం ముగింపు (82, 186)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు మూడు వందల పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కిందకు దిగి వచ్చింది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 156 పాయింట్ల లాభంతో 82, 343 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 44 పాయింట్ల లాభంతో 25, 105 వద్ద కొనసాగుతోంది. ఇటీవల ప్రకటించిన లాభాల కారణంగా ఎటర్నల్ షేర్లు మంగళవారం ఆల్ టైమ్ హైకి చేరుకున్నాయి. సెన్సెక్స్‌లో డిక్సన్ టెక్నాలజీస్, ఐఆర్ఎఫ్‌సీ, టాటా మోటార్స్, ఎల్‌టీ ఫైనాన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు లాభాల్లో ఉన్నాయి. లోధా డెవలపర్స్, ఒబెరాయ్ రియాల్టీ, కోల్గేట్, ప్రెస్టిజ్ ఎస్టేట్, ఎమ్ అండ్ ఎమ్ ఫైనాన్సియల్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 176 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 30 పాయింట్ల స్వల్ప లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.39గా ఉంది.

## ఈఎంఐలో రైలు టికెట్లు..
## ఐఆర్‌సీటీసీ సూపర్ ఆఫర్..




చేతిలో డబ్బులుండవు. అర్జంటుగా ఊరికెళ్లాలి. ఎవరి దగ్గర చేబదులు తీసుకోవాలా అనే ఆలోచనలు మనసును ముంచెత్తుంటాయి. కానీ, ప్రయాణికులు అలా చింతించాల్సిన అవసరం లేకుండా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ఈఎంఐలో ట్రైన్ టికెట్ కొనుగోలు చేసే సదుపాయం ప్రవేశపెట్టిందని మీకు తెలుసా. ఇ-కామర్స్ సైట్లలో ఎలాగైతే మనకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తున్నామో.. అచ్చం అలాగే ఇకపై ట్రైన్ టికెట్లు కొనుగోలు చేయవచ్చు. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్ ద్వారా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈఎంఐ ట్రైన్ టికెట్ సేవలను ఐఆర్‌సీటీసీ క్యాష్‌ఈ సంస్థతో కలిసి నిర్వహిస్తోంది. ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్ యాప్‌లోని 'ఇప్పుడు ప్రయాణించండి.. తర్వాత చెల్లించండి' అనే ఆప్షన్ ద్వారా ప్రయాణికులు టికెట్ బుక్ చేసుకుని వాయిదా పద్ధతిలో చెల్లించవచ్చు. సాధారణ, తత్కాల్ టికెట్ బుకింగ్ కోసమూ ఈ సేవలను ఉపయోగించుకోవచ్చు. యాప్ వినియోగించే ప్రతి ఒక్కరూ ఎలాంటి డాక్యుమెంటేషన్ సమర్పించకుండానే ఈ సేవలు పొందవచ్చు. 6 లేదా 8 నెలల వ్యవధిలో ఇన్‌స్టాల్‌మెంట్లు చెల్లించే సౌకర్యాన్ని ఐఆర్‌సీటీసీ కల్పిస్తోంది. పూర్తి టికెట్ అమౌంట్ మాత్రమే కాకుండా టికెట్ బుకింగ్ సమయంలో కొంత మొత్తం చెల్లించి మిగిలినది ఈఎంఐగా మార్చుకునే వెసులుబాటూ ఉంది. కాలవ్యవధి ఆధారంగా వడ్డీరేటు ఉంటుందని గుర్తుంచుకోవాలి.

## పన్ను చెల్లింపుదారులకు అలర్ట్..
## ఈ మోసాల గురించి హెచ్చరిక..




ఇటీవల కాలంలో డిజిటల్ వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ మోసాలు కూడా క్రమంగా పుంజుకుంటున్నాయి. ఈ క్రమంలో పన్ను చెల్లింపుదారులు సైతం ఈ మోసాల బారిన పడుతున్నారు. దీంతో పలు రకాల స్కామ్స్ గురించి జాగ్రత్తగా ఉండాలని ఆదాయపు పన్ను శాఖ సూచించింది. ఈ నేపథ్యంలో మీ వ్యక్తిగత వివరాలను మాన్యువల్ వెరిఫికేషన్ చేయాలని మీకు ఆదాయపు పన్ను శాఖ నుంచి ఏదైనా ఈ మెయిల్ వస్తే అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఎందుకంటే ఆ మెయిల్స్ నకిలీవి, ఫిషింగ్ స్కామ్‌లో భాగంగా వచ్చినవని హెచ్చరించింది.ఫిషింగ్ అనేది మోసగాళ్లు ఆదాయపు పన్ను శాఖ వంటి విశ్వసనీయ సంస్థలను అనుకరిస్తూ, మీ బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు లేదా క్రెడిట్ కార్డ్ నంబర్ల వంటి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించే ప్రయత్నం చేస్తారు. వారు ఎక్కువగా వినియోగించే ఈ-మెయిల్స్ లేదా వెబ్‌సైట్‌లు మాదిరిగా ఉండే వాటిని ఉపయోగిస్తారు.

## అత్యంత ఆకర్షణీయ బ్రాండ్లలో
## టాటా గూగుల్ ఇన్ఫోసిస్




న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగులకు అత్యంత ఆకర్షణీయ కార్పొరేట్ బ్రాండ్ల జాబితాలో టాటా గ్రూప్, గూగుల్ ఇండియా, ఇన్ఫోసిస్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయని 'రాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్ (ఆర్ఈబీఆర్) 2025' నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఉద్యోగులు వృత్తి-వ్యక్తిగత జీవిత సంతులనం, ఈక్విటీ, ఆకర్షణీయ వేతనం సహా అదనపు ప్రయోజనాలు వంటి ఎంప్లాయీ వాల్యూ ప్రపోజిషన్స్ (ఈవీపీ)కు అధిక ప్రాధాన్యమిస్తున్నారని నివేదిక పేర్కొంది. ఆర్థిక సమృద్ధి, వృత్తిలో పురోగతి అవకాశాలు, పేరు ప్రతిష్ఠల విషయంలో టాటా గ్రూప్‌నకు అధిక స్కోర్ లభించిందని, తద్వారా లిస్ట్‌లో టాప్‌లో నిలిచిందని రాండ్‌స్టడ్ తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే గూగుల్ ఇండియా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుని రెండో స్థానానికి చేరుకోగా.. దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సామ్‌సంగ్ ఇండియా, జేపీ మోర్గాన్ చేజ్ 4, 5 స్థానాలను దక్కించుకోగా.. ఐబీఎం, విప్రో, రిలయన్స్ ఇండస్ట్రీస్, డెల్, ఎస్‌బీఐ వరుసగా 6 నుంచి 10 స్థానాల్లో నిలిచాయంది. ఈ జాబితాలోని ఏకైక బహుళజాతి ప్రభుత్వ రంగ సంస్థ ఎస్‌బీఐ అని రిపోర్టు వెల్లడించింది. భారత్‌లో 3,500 మందితో సహా 34 మార్కెట్లలో 1.70 లక్షల మంది నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా రాండ్‌స్టడ్ ఈ నివేదికను రూపొందించింది. నివేదికలోని మరిన్ని విషయాలు..

## తొలిసారిగా లాభాల్లోకి పేటీఎం




న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండ్ మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తొలిసారిగా లాభాల్లోకి అడుగు పెట్టింది. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.122.50 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. వ్యయాలను గణనీయంగా నియంత్రించడంతో పాటు పేమెంట్ ఆదాయాలు పెరగడం ఇందుకు దోహదపడినట్లు కంపెనీ తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.840 కోట్ల నికర నష్టం ప్రకటించింది. స్థూల లాభం సైతం రూ.72 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే కంపెనీ మార్కెటింగ్, ప్రచార వ్యయాలను సగానికి సగం తగ్గించుకుంది. జూన్ త్రైమాసికంలో పేమెంట్ ప్రాసెసింగ్ మార్జిన్లు పెరిగిన కారణంగా కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,917.50 కోట్లకు పెరిగింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006